## క్లుప్తంగా

### రైతు బజార్ వద్ద ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**మద్దిపాలెం :** నిత్యం ట్రాఫిక్‌జామ్‌కు కారణమవుతున్న రైతుబజార్ వద్ద ఆక్రమణలను తొలగించారు. ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఎస్ఐ పాపారావు సమక్షంలో కానిస్టేబుళ్లు మంగళవారం ఆక్రమణలు తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న తోపుడుబండ్లు, హాకర్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తోపుడు బండ్లు హాకర్‌జోన్లలో మాత్రమే ఉంచి వ్యాపారాలు సాగించాలని కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో చిరువ్యాపారులు ట్రాఫిక్‌పోలీసులకు సహకరించాలని కోరారు.

### మురుగుతో అవస్థలు



నిరసన తెలుపుతున్న స్థానికులు

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం 80ఫీట్ రోడ్ వాటర్ ట్యాంక్ పక్కన మురుగు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానికులు వీరాటవర్స్ ఎదురుగా మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తారకరామానగర్, ప్రశాంతినగర్, గురునాథరావు కాలనీ, రామచంద్రనగర్ ప్రాంతాల వాసులు నిత్యం ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి రహదారిపై ఇలా మురుగునీరు ప్రవహిస్తూ, దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడు లేడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ కమిషనర్‌ను ఆన్‌లైన్లో ఫిర్యాదు కూడా ఇచ్చామని, అయినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయమై అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

**సీతమ్మధార:** ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ విద్యార్థి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా..గ్రీన్‌పార్కు కాలనీలో పి.హేమేశ్వరరావు, భార్య, కుమారుడు నివాసం ఉంటున్నారు. సీతమ్మధారలోని బాలయ్య శాస్త్రి లేఅవుట్ ఓ స్కూల్‌లో టీఎస్‌వీఏ నాథల్ 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం 4 గంటలకు స్కూల్ నుంచి నడుచుకుంటూ పెట్రోల్ బంక్ రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గాయపడిన నాథల్‌ను సమీపంలోని ఓ ఆస్పత్రికి స్థానికులు తీసుకువెళ్లారు. తలకు తీవ్రగాయమవడంతో వైద్యులు చికిత్స చేస్తున్నారు. బాలుడు తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ వి.శ్రీనివాసరావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు సీసీ పుటేజ్ ద్వారా ఢీకొట్టిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

### మహిళా కళాశాలలో యోగా కార్యక్రమం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

**దాబాగార్డెన్స్:** విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యోగా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి విద్యార్థులకు యోగా విశిష్టత గురించి వివరించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఎ. హైమావతి, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ కె. ప్రశాంతి, ట్రైనర్ బి. సునీల్, విద్యార్థినులు పాల్గొన్నారు.



# భవితకు కానుక

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ చదువుల భారమంతా తన భుజాలకెత్తుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వరుసగా నాలుగో ఏడాదీ జగనన్న విద్యాకానుకను అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేసింది. బడి తెరిచిన రోజే కానుకలు ఇచ్చి సంతోషం నింపింది. జగన్ మావయ్య ఇచ్చిన కానుకలు చూసి చిన్నారులు మురిసిపోయారు. కొత్త యూనిఫారం, షూ, టై, బెల్ట్, బ్యాగుతో విద్యార్థులు ఉత్సాహంగా బడికి వెళుతున్నారు. నియోజకవర్గంలో రెండో రోజూ జగనన్న విద్యాకానుకలు పంపిణీ చేశారు.



విద్యార్థులకు జేవీకే కిట్లు అందిస్తున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు



విద్యాకానుక కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ ప్రసాద్

- ఉత్సాహంగా జగనన్న విద్యాకానుకల పంపిణీ

**మురళీనగర్:** రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలనతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నూతన శకానికి నాంది పలికారని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటరు అల్లు శంకరరావు అన్నారు. వార్డులోని ఏఎస్సార్‌నగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యా వ్యవస్థలో కీలకమైన సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. పేద విద్యార్థి పాఠశాల విద్యను అభ్యసించాలనే సదాశయంతో కోట్ల రూపాయల ఖర్చు చేస్తున్నారన్నారు. పేదలకు చదువుకు అడ్డు రాకూడదనే ఆశయంతో పాఠశాలల్లో పూర్తి సౌకర్యాలు కల్పించడంతోపాటు, ఇంగ్లిషు మీడియం విద్య, విద్యార్థులు చదువుకోవడానికి అవసరమైన జగనన్న విద్యా కానుక కిట్లు, రుచికరమైన, సంపూర్ణ పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్ఎన్ఎం సాయిలక్ష్మి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవి కుమార్, బీసీ నాయకుడు ఢిల్లీ రావు, వార్డు సీనియర్ నాయకులు రామకృష్ణ, ఉమా మహేశ్వరరావు, కె.అప్పారావు, పి.చిన్న, బి.శంకర్, కె.మున్నా, సీహెచ్.శ్రీను, శివరామ్ ప్రసాద్, కిషోర్, రమేష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.



మధురానగర్ హైస్కూల్‌లో పంపిణీకి సిద్ధం చేస్తున్న జేవీకే కిట్స్

**విద్యారంగానికి పెద్దపీట**

**మద్దిపాలెం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న జగనన్న విద్యాకానుక, విద్యారంగ సంస్కరణలతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోందని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పేర్కొన్నారు. వార్డులోని మాధవధారలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా అమలు చేస్తున్న విద్యారంగ సంస్కరణలు విద్యారంగాన్ని స్వర్ణయుగంలో వెళ్లేలా చేశాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.పి.నాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బీ.రామారావు, పి.కృష్ణారావు, ఎస్.నారాయణస్వామి, పి.అప్పారావు, ఏవీఎస్ రాజు, ఎస్.శ్రీను, ఎం.వి. రెడ్డి.కే. రఘు, డి.నారాయణరావు, శ్రీను, రామారావు, నారాయణరెడ్డి, రమేష్, రాము, త్రినాథ్, చిరంజీవి, నాయుడు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**జగనన్న విద్యా కానుకలు పంపిణీ నేడు**

**సీతంపేట:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ముఖ్య మంత్రి అందజేస్తున్న జగనన్న విద్యా కానుకలు బుధవారం పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు. జీవీఎంసీ 25, 26, 43, 44 వార్డుల్లో ఉన్న జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జేవీకే కిట్స్ పంపిణీకి ఏర్పాట్లు చేశారు. సీతంపేటలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, మధురానగర్‌లోని జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, ముస్లిం తాటి చెట్లపాలెంలోని ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లో విద్యాకానుక కిట్లు పంపిణీ చేయనున్నారు. ఈమేరకు సోమవారం సాయంత్రం ఆయా పాఠశాలలకు తొమ్మిది రకాల కానుకలతో కూడిన విద్యా కానుక కిట్లు చేరుకున్నాయి. వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు ప్రారంభం అయిన వెంటనే విద్యాకానుకలు పంపిణీ చెయ్యడం విశేషం. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఉపాధ్యాయ సిబ్బంది కానుకలను వేర్వేరుగా ప్యాక్ చేసి పంపిణీకి సిద్ధం చేశారు.

**ఎస్ఎంసీహెచ్ హైస్కూల్‌లో**

**సీతమ్మధార :** విద్యార్థులంతా ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని 24 వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ నోట్ బుక్స్ ,బ్యాగ్స్ , షూస్, యూనిఫారంతో పాటు ఇతర వస్తువులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రఘు, హెచ్ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు హెనా పాల్గొన్నారు.

## వలంటీర్ల సేవలు కీలకం



26వ వార్డులో సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లు

**సీతంపేట:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవెయ్యడంలో వలంటీర్ల పాత్ర కీలకమని వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో జయలక్ష్మి ఫంక్షన్‌హాల్లో జరిగిన 26వ వార్డు వలంటీర్లకు సేవా మిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా, ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఒక్క రూపాయి అవినీతి లేకుండా అమలు చేస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. జీవీఎంసీ జోన్3 ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 88 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు ఇంచార్జి పీలా వెంకటలక్ష్మి, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఏపీడీ దుర్గాప్రసాద్, , స్థానిక నాయకులు అమ్మాజీ, పాండవ శ్రీను, అనురాగ్, శేషు, శ్యామల, రమాదేవి, సుశీల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

## వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

**సీతమ్మధార :** జీవీఎంసీ పరిధి 14 వార్డులోని బాలయ్యశాస్త్రిలేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలోని మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు కేకేరాజుకు వినతులు అందజేశారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారులకు చేరువగా అంగన్‌వాడీ విద్య

**మద్రిపాలెం:** అంగన్‌వాడీ కేంద్రాలలో ఫోర్ డెవలప్‌మెంట్ కార్నర్ల ఏర్పాటు ద్వారా చిన్నారులకు విద్య చేరువ చేయాలని ఐసీడీఎస్ అదనపు సీడీపీవో శ్రీలత కోరారు. మద్రిపాలెంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ద్వారా జన భాగీదారీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ చుట్టుపక్కల నివసిస్తున్న తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహ్వానించాలని కోరారు. ఆయా కేంద్రాలలో ప్రీ-స్కూలు విద్యాకార్యక్రమాలు పిల్లల సమగ్రాభివృద్ధికి ఎలా ఉపయోగపడు తున్నాయో వారికి వివరించాలని సూచించారు. మూడేళ్ల వరకు ఇంట్లో ఉండే చిన్నారులకు తరువాత మూడేళ్లు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఈ వయసులో పిల్లలు వినే అంశాల ఆధారంగానే బుద్ధి, తెలివితేటలు పెరుగుతాయని అన్నారు. ఆటలు, పాటలు, కథల ద్వారానే వారి మనసుకు హత్తుకునేలా ప్రీ-స్కూలు విద్య ఉంటుందని ఆమె గుర్తు చేశారు. పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ల సూపర్ వైజర్లు వెన్నిసా సుందరి, వరలక్ష్మి, జేటీఎస్.జ్యోతి, వి.ఇందిరా, బి.కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అదనపు సీడీపీవో శ్రీలత

## రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

**సీతమ్మధార :** రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకేరాజు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ పరిధి 24 వార్డులోని చైతన్యనగర్ (10861 39) సచివాలయం పరిధిలో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కేకే రాజుతో కలిసి వార్డు కార్పొరేటర్ సాడిపద్మారెడ్డి రేసపువానిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కేకేరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి పాలనలో విశాఖ నగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వి.ప్రసాద్, జోన్-3 , ఏపీడీ దుర్గాప్రసాద్, కిరణ్‌రాజు, డైరెక్టర్ రాయుడు శ్రీనివాస్, బి.రామిరెడ్డి, బాబీ, రేసపు కృష్ణారెడ్డి, కామేశ్వరరెడ్డి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



రేసపువానిపాలెంలోని సంక్షేమ పథకాలను వివరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

## జగన్నాథుని ఉత్సవాలకు మేయర్‌కు ఆహ్వానం

**దాబాగార్డెన్స్:** దేవదాయ శాఖ ఆధ్వర్యంలో టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. జీవీఎంసీ మేయర్ చాంబర్లో మంగళవారం మేయర్‌ను ఈవోతో పాటు ఆలయ ప్రధాన అర్చకుడు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా రథయాత్ర మహోత్సవాల ఏర్పాట్లు, క్యూలైన్లు, మెడికల్, మంచినీరు తదితర సదుపాయాల ఏర్పాట్లపై మేయర్‌కు ఈవో రాజగోపాల్‌రెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులు వివరించారు. ఉత్సవాలు ఈ నెల 19 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు మేయర్‌కు వివరించారు.



మేయర్‌కు ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో రాజగోపాలరెడ్డి తదితరులు

## ఐఎస్ఎంసీ సభ్యుడిగా హనుమంతు పురుషోత్తం

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ-ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం ఇంక్యుబేటర్ సీడ్ ఫండ్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఐఎస్ఎంసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ మరట్వాడా యూనివర్సిటీలో(బీఏఎంయూ)ని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఐఎస్ఎంసీ ఏర్పాటైంది. దీనిలోని 11 మంది సభ్యుల్లో ఒకరిగా డాక్టర్ పురుషోత్తం నియమితులయ్యారు.

## కళాశాలలో 'నారాయణ అండ్ కో' సందడి

**అగనంపూడి:** దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నారాయణ అండ్ కో చిత్ర యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా కళాశాలను సందర్శించి, అక్కడి విద్యార్థులతో చిట్‌చాట్ చేశారు. చిత్ర కథానాయకుడు సుధాకర్ కాముకల, కథానాయిక ఆర్తి, దర్శకుడు చిన్న పాపిశెట్టి, నటి ఆమని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా చిత్రాన్ని రూపొందించామన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న చిత్ర దర్శకుడు చిన్న పాపిశెట్టి

## మాతృ మరణాల నివారణ బాధ్యత వైద్యులదే..

**మహారాణిపేట :** జిల్లాలో మాతృ మరణాలు సంభవించరాదని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల శ్రీకాంత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కారాదన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మాతృ మరణాలు జరిగితే దానికి వైద్యులు బాధ్యత వహించాల్సి ఉందన్నారు. గర్భిణుల వివరాల నమోదు నాటి నుంచి ప్రసవించే వరకు సక్రమంగా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీడీ డి.వెంకటలక్ష్మి, వీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, గైనిక్ వైద్యులు డాక్టర్ సువర్ణ, డాక్టర్ శ్రీలక్ష్మి, మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమావతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఎస్‌సీబీ నాయుడు, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

## వ్యక్తి అదృశ్యం

**అల్లిపురం:** భార్యతో తగాదాలు, కోర్టు గొడవల కారణంగా వ్యక్తి అదృశ్యమైన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం దాబాగార్డెన్స్, చాకలివీధికి చెందిన కిలాడి వెంకట శివ ప్రతాప్ ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని, అతని కోసం నగరంలో పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని అతని సోదరుడు వేణు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన వ్యక్తి సుమారు 5.9 అడుగుల ఎత్తు కలిగి, నల్లటి శరీర ఛాయతో ఉంటాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 0891-2783672, 8919812412 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

**సీతమ్మధార :** జీవీఎంసీ పరిధి 50వ వార్డుకు చెందిన గరుగుబిల్లి శిరీష మూడేళ్లుగా క్యాన్సర్‌తో పోరాడుతోంది. దీంతో ఆమె తల్లిదండ్రులకు నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎం సహాయ నిధి నుంచి బాధితురాలి చికిత్స కోసం రూ.10 లక్షలు విడుదల చేయించారు. ఈమేరకు ఆ చెక్కును బాధిత కటుంబ సభ్యులకు మంగళవారం కేకే రాజు అందజేశారు. శిరీష తండ్రి మాట్లాడుతూ సమస్యను విని వెంటనే స్పందించిన కేకే రాజుకు, పెద్ద మనసు చేసుకుని రూ.10 లక్షలు విడుదల చేసిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వి.ప్రసాద్, ,కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాస్, పేడాడ రమణకుమారి, కిరణ్‌రాజు, కృష్ణారావు, చిన్నా, మాస్టార్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబసభ్యులకు చెక్కు అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

# వైభవంగా కనకమాంబ పండగ



అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్



ఆకట్టుకున్న కాంతారా డ్యాన్స్ ట్రూప్



తప్పెటగుళ్ల కళాకారుల సందడి



దుకాణాల వద్ద వినియోగదారులు

**సీతంపేట:** సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి ప్రధాన పండుగ కన్నుల పండువగా జరిగింది. మంగళవారం తెల్లవారు జామునుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సీతంపేట, గొల్లవీధి, నాయుడువీధి, కనకమ్మవీధి, శ్రీనివాసవీధి, గణేష్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులతో మొక్కుబడులు సమర్పించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాయంత్రం నాయుడు వీధిలోని పుట్టబంగారం ఘటాలతో అమ్మవారి అనుపోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు అమ్మవారికి హారతులతో నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోయ డ్యాన్సులు, నేల డ్యాన్సులు, తప్పెటగుళ్లు, కోలాటం, పులి వేషాలు, పగటి వేషాలు, సేవ గరిడీలు, కర్రసాము, చెక్కభజన వంటి సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కాంతారా డ్యాన్స్ ట్రూప్ విశేషంగా ఆకట్టుకుంది. బాణసంచా, విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీతంపేట కూడలిలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్, రెల్లివీధి రోడ్‌లో ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్,ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్,మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, ఆడిటర్ జీవీ, గొలగాని శ్రీనివాస్, చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు అమ్మవారికి పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్, శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి సారిపిల్లి గంగరాజు, కోశాధికారి బోర వెంకటరమణ, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## బోర్లాపడిన డంపర్‌బిన్



**తాటిచెట్లపాలెం :** జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురం పోర్టు క్వార్టర్స్ వద్ద, దీప్ భవన్ ఎదురుగా జీవీఎంసీ ఏర్పాటుచేసిన డంపర్‌బిన్ బోర్లాపడింది. దీంతో డంపర్‌బిన్‌లో వేయాల్సిన చెత్తను స్థానికులు పక్కనే పడేస్తున్నారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.